సాక్షి జగిత్యాల

గురువారం, 9, జనవరి, 2025



గోదావరిలో పుణ్యస్నానాలు

ధర్మపురి: ధర్మపురి వద్దగల గోదావరిలో బుధవారం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సంతోషిమాత, మంగలిగడ్డఘాట్లు భక్తులతో నిండిపోయాయి.



జాతర ఘనంగా నిర్వహిద్దాం

మహాశివరాత్రి జాతర ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. జాతర సందర్భంగా చేపట్టాల్సిన పనులపై వివిధ శాఖల అధికారులకు సూచనలు చేశారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
29.0/16.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉదయం దట్టమైన పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. రాత్రి చలిగాలులు కొనసాగుతాయి.

బీపీ పెరుగుతోంది.. తీపి తరుముతోంది!

- యువతే 40 శాతం
- మారుతున్న జీవనశైలి ప్రధాన కారణం

ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న రక్తపోటు, మధుమేహ బాధితులు



జగిత్యాల/సాక్షి,పెద్దపల్లి:

ఈ మధ్య కాలంలో ఎవరిని కదిలించినా .. బీపీ వచ్చిందండి.. షుగర్ అటాక్ అయ్యింది అంటున్నారు. తాజాగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్‌సీడీ(నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్) సర్వేలోనూ బీపీ, షుగర్ బాధితుల సంఖ్య ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పెరుగుతున్నట్లు తేలింది. మారుతున్న జీవన శైలి, వృత్తి, ఉద్యోగ జీవితాల్లో ఒత్తిడులు, శారీరక వ్యాయామానికి సమయం కేటాయించకపోవడం తదితర కారణాలతో చాలామంది బీపీ, షుగర్ వ్యాధుల బారిన పడుతున్నారు. గతంలో వీధికొక్కరో.. ఊరికిద్దరో ఉండే బాధితుల సంఖ్య ప్రస్తుతం కనీసం ఇంటికొకరిగా మారిపోయింది. ఈ వ్యాధుల బారిన పడుతున్న వారిలో యువత సైతం అధిక సంఖ్యలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు 50, 60 ఏళ్ల దాటిన వారికి వచ్చేవి. ఇప్పుడు వయసుతో సంబంధం లేకుండా 40 ఏళ్లలోపు వారు కూడా బాధితులవుతున్నారు. మరోవైపు పల్లె, పట్టణం తేడా లేకుండా అంతటా వస్తున్నాయి. ఒక్కసారి వస్తే వీటికి జీవితాంతం మందులు వాడుతూనే ఉండాలి.

గుర్తించేందుకు సర్వే..

జీవనశైలి మారడంతో 30 ఏళ్లవారు కూడా మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారినపడుతున్నారు. ఇలాంటి వారు వేలాది మంది ఉన్నారని గుర్తించిన ప్రభుత్వం ఎన్‌సీడీ సర్వే చేపడుతోంది. పీహెచ్‌సీలు, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో భాగంగా వైద్య పరీక్షలు చేస్తూ బీపీ, షుగర్ వ్యాధులను గుర్తిస్తోంది. నోటి కేన్సర్, గైనిక్ సంబంధిత కేన్సర్ లక్షణాలున్నవారిని నిర్ధారణ కోసం హైదరాబాద్‌కు రెఫర్ చేస్తున్నారు. బీపీ, షుగర్ ఉన్నవారికి మందులు అందిస్తూ వ్యాధి తీవ్రం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 84.02 శాతం పరీక్షలు పూర్తవగా.. రక్తపోటు, మధుమేహం ఉన్నవారిని పెద్ద సంఖ్యలో గుర్తించారు. వారి వివరాలు వెబ్‌పోర్టల్‌లో నమోదు చేస్తూ ఎన్‌సీడీ కార్డు అందిస్తున్నారు. ఇందులో పేషెంట్ పేరు, వ్యాధికి ఇస్తున్న మందుల వివరాలు పొందుపరుస్తున్నారు. పీహెచ్‌సీ పరిధిలో ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంల ద్వారా ప్రతినెలా మందులు అందిస్తున్నారు.



కాట్నపల్లిలో ఎన్‌సీడీ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పట్టణ ప్రాంతాల్లోనే అధికం..

గత ఐదేళ్లలో చూస్తే బీపీ, షుగర్ బారిన పడుతున్న వారిలో యువత సంఖ్య భారీగా పెరుగుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. మొత్తం బాధితుల్లో 40 శాతం మంది వరకు యువతే ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లోని వారే ఎక్కువగా మధుమేహం, రక్తపోటు బారిన పడుతున్నట్లు గుర్తించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,26,204 మంది రక్తపోటు, 1,00,675 మంది మధుమేహ బాధితులు ఉన్నారు.

బీపీ రాకుండా ఉండాలంటే..

- రోజుకు 5–6 గ్రాముల కన్నా తక్కువ ఉప్పు తీసుకోవాలి.
- కొవ్వు ఎక్కువగా ఉండే ఫుడ్ తగ్గించాలి.
- అరటిపండ్లు, ఆలివ్, డ్రైఫ్రూట్స్ వంటి పొటాషియం ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి.
- ధూమపానం, మద్యపానం, కాఫీ మానేయాలి. రోజుకు 7–8 గంటలు నిద్ర పోవాలి.
- ప్రతీరోజు కనీసం 30 నిమిషాలు నడక, యోగా, ధ్యానం లేదా స్వల్ప వ్యాయామం చేయాలి.

షుగర్ రాకుండా ఉండాలంటే..

- చక్కెర తగ్గించి, జొన్న, రాగి, గోధుమ వంటి ధాన్యాలు తీసుకోవాలి.
- ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించవచ్చు.
- బీన్స్, బాదం, క్యారెట్, కీరా, ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలి.
- అధిక బరువు డయాబెటిస్ ముప్పును పెంచుతుంది. కాబట్టి, రోజూ జాగింగ్ చేయాలి.
- కుటుంబంలో షుగర్ ఉన్నవారు ఉంటే, మిగిలిన కుటుంబసభ్యులు తమ రక్తంలో చక్కెర స్థాయిలను పరీక్ష ద్వారా తరచూ తెలుసుకోవాలి.
- రోజులో మూడు పూటలు బాగా తినడానికి బదులు చిన్నచిన్న మొత్తాల్లో ఎక్కువసార్లు భోజనం చేయాలి.

జీవనశైలిలో మార్పు రావాలి



ప్రస్తుతం 30ఏళ్ల వారికే బీపీ, షుగర్ వస్తున్నాయి. జీవనశైలిలో మార్పులు వస్తేనే వీటిని అరికట్టవచ్చు. యువత జంక్‌ఫుడ్‌కు అలవాటు పడటం, వాకింగ్ చేయకపోవడంతో షుగర్, బీపీ వస్తున్నాయి. వంశపారంపర్యంగానూ వస్తా యి. తల్లిదండ్రులకు బీపీ, షుగర్ ఉన్న యువత జాగ్రత్తపడాలి. మొదటి నుంచి జాగ్రత్తలు పాటిస్తేనే బీపీ, షుగర్ రావు. ఆహారంలో ఉప్పు బాగా తగ్గించాలి. ఒత్తిడి లేకుండా నిత్యం యోగా చేయాలి.– కె.ప్రమోద్‌కుమార్, డీఎంహెచ్‌వో


సెల్‌ఫోన్లతోనే సమస్య



యువత సెల్‌ఫోన్లకు అడిక్ట్ అవుతున్నారు. 30ఏళ్లలోనే బీపీ, షుగర్, ఇతర అనారోగ్యాలకు గురవుతున్నారు. ఫిజికల్ యాక్టివిటీ లేకపోవడంతో బీపీ, షుగర్ బారిన పడుతున్నారు. మైండ్‌సెట్ అంతా సెల్‌ఫోన్‌పైనే పెడుతున్నారు. ఆల్కాహాల్, డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారు. వీటన్నింటికి దూరం ఉండటంతోపాటు, క్రీడల్లో ఎక్కువగా పాల్గొనాలి. జీవనశైలిలో మార్పు వస్తేనే వీటిని అరికట్టవచ్చు.

– వాసాల శ్రీధర్, ఎండీ ఫిజీషియన్

జిల్లాల వారీగా ఎన్‌సీడీ సర్వే వివరాలు



వణికిస్తున్న చలి.. తలదాచుకునే చోటేది..?

- అనాథల కోసం జిల్లాకేంద్రంలో నిరాశ్రయుల కేంద్రం
- 15 ఏళ్ల క్రితం ఏర్పాటు.. నిర్వహణకు ఏటా రూ.6లక్షలు
- వసతులు లేక వెనుకంజ
- అభాగ్యులకు ఫుట్‌పాత్‌లు, బస్టాండ్‌లే పెద్ద దిక్కు



బస్టాండ్‌లో చలిలో పడుకున్న నిరాశ్రయులు

జగిత్యాల: చలి గజగజ వణికిస్తోంది. ఇంట్లో పడుకుని దుప్పట్లు కప్పుకున్నా చలి ఆగడం లేదు. ఇంత చలిలో అనాథలు, భిక్షాటన చేసేవారి పరిస్థితిని తల్చుకుంటేనే వెన్నులో వణుకుపుడుతుంది. ఎముకలు కొరికే చలిలోనూ వారు బస్టాండ్, ఫుట్‌పాత్‌లపై పడుకుని కాలం వెల్లదీస్తున్నారు. అయితే వీరి కోసం జిల్లాకేంద్రంలో 15 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన నిరాశ్రయుల కేంద్రం మాత్రం నిరుపయోగంగా ఉంచడం విమర్శలకు తావిస్తోంది.

మున్సిపాలిటీల్లో అనాథలు, భిక్షాటన చేసేవారు, పట్టణానికి వచ్చి వారు రాత్రి అయితే ఇళ్లకు వెళ్లలేని వారి కోసం జిల్లా కేంద్రంలో 15 ఏళ్ల క్రితం నిరాశ్రయుల కేంద్రం ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కొనసాగే ఈ కేంద్రంలో అనాథలు, వలస కార్మికులు తలదాచుకునే అవకాశం ఉంది. అలాంటి ఈ కేంద్రాన్ని ఎంపీడీవో కార్యాలయం ఎదుటగల బిల్డింగ్‌లో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం నిర్వహణకు ఏటా రూ.6లక్షలు కేటాయిస్తున్నారు. కానీ.. అందులో తలదాచుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. కేంద్రం నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో వసతులు లేవు. నిబంధనల ప్రకారం ఈ కేంద్రంలో కేర్ టేకర్, వాచ్‌మన్ ఉండాలి. ప్రస్తుతం ఎవరూ విధులు నిర్వర్తించడం లేదు. ఇటీవలే మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఓ గదికి మార్చారు. కానీ వసతులు కల్పించకపోవడంతో నిరాశ్రయులకు వినియోగించుకోవడం లేదు. మెప్మా, మున్సిపల్ అధికారులు నిరాశ్రయులను నామమాత్రంగా సర్వే చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రస్తుతం నిధులు వస్తలేవని అధికారులు పేర్కొంటున్నారు.

రెండేళ్లుగా నిలిచిన నిధులు

నిరాశ్రయుల కేంద్రం నిర్వహణను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ఎన్జీవోలు, స్వచ్ఛంద సంస్థలకు అప్పగించాల్సి ఉంటుంది. జిల్లాకేంద్రంలో ఎవరూ ముందుకు రాకపోవడంతో మహిళాసమైక్యతో కొనసాగిస్తున్నారు. కేంద్రంలో భోజనం సౌకర్యం ఏర్పాటు చేయకున్నా.. బెడ్లు, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతరత్రా సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. మరోవైపు ఈ కేంద్రానికి రెండేళ్లుగా నిధుల విడుదల నిలిచిపోయినట్లు తెలిసింది. గతంలో వచ్చిన నిధులు ఏమయ్యాయో..?వాటిని ఎందుకు ఖర్చు పెట్టారో ఎవరికీ తెలియడం లేదు.

అధికంగానే నిరాశ్రయులు

జిల్లాకేంద్రంలో కొందరు నిరాశ్రయులు ఫుట్‌పాత్‌లు, బస్టాండ్‌లు, హోటళ్లలో రాత్రిపూట పడుకుంటారు. జిల్లాకేంద్రానికి వివిధ పనుల నిమి త్తం వచ్చి తిరిగి వెళ్లేందుకు సౌకర్యం లేనివారు కూడా బస్టాండ్, ఫుట్‌పాత్‌లపైనే కాలం వెళ్లదీస్తున్నారు. అధికారులు ఇలాంటి వారిని గుర్తించి నిరాశ్రయుల కేంద్రానికి తరలించాల్సి ఉంటుంది. అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. చాలామంది కూరగాయలు విక్రయించేందుకు జిల్లాకేంద్రానికి వస్తుంటారు. రాత్రి సమయంలో బస్సులు లేకుంటే ఈ కేంద్రాన్ని వినియోగించుకునే అవకాశం ఉంది. కానీ.. కేంద్రం ఉన్నట్లు వారికి కనీసం తెలియదంటే అధికారుల పనితీరును అర్థం చేసుకోవచ్చు.

అవగాహన కల్పిస్తాం..



నిరాశ్రయుల కోసం జిల్లాకేంద్రంలో ఓ గదిని కేటాయించారు. అందులో అన్ని వసతులున్నాయి. దానిని సద్వినియోగం చేసుకోవాలి. నిరాశ్రయులపై మెప్మా ఆధ్వర్యంలో సర్వే చేస్తున్నాం. వారికి ఆ కేంద్రంపై అవగాహన కల్పించి ఉండేలా చర్యలు తీసుకుంటాం. – చిరంజీవి, మున్సిపల్ కమిషనర్

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హైస్కూల్ విద్యార్థులు సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో స్విమ్మింగ్‌లో చంద్రమోహన్ రజతం, బాక్సింగ్‌లో అఖిల్ కాంస్య పతకం సాధించారు. విద్యార్థులను హెచ్ఎం చంద్రకళ, పీడీ శ్రీనివాస్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆనందరావు, సూర్యప్రకాశ్, సురేందర్ అభినందించారు.

జగిత్యాల: పరకాలలో కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో జగిత్యాల విద్యార్థులు గోల్డ్‌మెడల్ సాధించారు. శ్రీసరస్వతి శిశుమందిర్ విద్యార్థులు బి.శ్రవణ్ వైభవ్ కటా విభాగంలో, శ్రీహర్ష స్పారింగ్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. వారిని ప్రిన్సిపాల్ రాజేందర్, కరాటే మాస్టర్ తిరుమల నరేశ్ అభినందించారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి



ఉద్యోగుల డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: గురుకులాల్లో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో వివిధ గురుకులాల్లో (ఆంగ్లమాధ్యమం) ప్రవేశానికి ఫిబ్రవరి 23న పరీక్ష ఉంటుందని, www.tgcet.cgg.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి ఒకటో తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆదాయం, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు, ఫొటో అవసరముంటుందని తెలిపారు. కలెక్టరేట్‌లో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామని, ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇది పనిచేస్తుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ గురుకులాల్లో ఐదోతరగతి, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుంచి 9 తరగతుల్లో ఖాళీ సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గౌళిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకులంలో 9వ తరగతి, ఖమ్మం జిల్లా పరిగిలోని గిరిజన సంక్షేమ గురుకులంలో 8వ తరగతి, అల్లునూర్‌లోని సీఈవో పాఠశాలలో 9వ తరగతి, రుక్మాపూర్ సైనిక్‌స్కూల్, మల్కాజ్‌గిరి స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హాస్టళ్లలో మెనూ అమలు చేయాలి

హాస్టళ్లలో మెనూ అమలుచేయాలని కలెక్టర్ అన్నారు. హెడ్మాస్టర్లతో బుధవారం సమావేశమయ్యారు. పిల్లల్లో ఏ, బీ, సీ, డీ గ్రేడ్‌ను నిర్ణయించి సీ, డీ కేటగిరీల పిల్లలపై శ్రద్ధ వహించాలన్నారు. ఫు డ్‌పాయిజన్ సంఘటనలు చోటుచేసుకోకుండా చ ర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతిలో వందశా తం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ లత, డీఈవో రాము పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

కలెక్టరేట్ ఉద్యోగుల అసోసియేషన్ రూపొందించిన డైరీని కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్యప్రసాద్ ఆవిష్కరించారు. అధికారుల పనితీరును మెరుగుపర్చుకునేలా డైరీ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్, జివాకర్, శ్రీనివాస్, వెల్ఫేర్ ఆఫీసర్ చిత్రు పాల్గొన్నారు.

రైతులకు సాగునీటి కొరత రానీయొద్దు

- ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల: రైతులకు సాగునీటి కొరత లేకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని, ప్రతి ఎకరాకూ నీరందేలా చూడాలని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టర్‌తో కలిసి అధికారులతో సమావేశమయ్యారు. రైతుల కోసం ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలను వేగవంతం చేసి సాగు అవసరాలు తీర్చాలన్నారు. వారబందీ ద్వారా జోన్–1, జోన్–2కు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నీటి విడుదల చేయాలని సూచించారు. కొన్నిచోట్ల మోటార్లు పెట్టడం, ఇతరత్రా కారణాలతో నీరు అందక ఇబ్బంది పడుతున్నారని, ఆ సమస్య రాకుండా చూడాలని తెలిపారు. జంగనాలా ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని సూచించారు. ఇప్పటికే గోదావరిలోకి టీఎంసీ నీరు విడుదల చేయాలని ఇరిగేషన్ మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ చివరి ఆయకట్టు వరకు నీరందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఈలు, డీఈలు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- కమలదళం దండెత్తితే కాంగ్రెస్ దాక్కోవడానికి జాగ దొరకదు
- కాంగ్రెస్‌లో చేరలేదన్న ఎమ్మెల్యే పార్టీ మీటింగ్‌కు ఎలా వెళ్లారు..?
- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భోగ శ్రావణి



మాట్లాడుతున్న శ్రావణి, నాయకులు

జగిత్యాలటౌన్: రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజాప్రభుత్వం కాదని, ప్రజల నడ్డి విరుస్తూ.. ప్రతిపక్షాలపై దాడులకు తెగబడుతున్న అరాచక ప్రభుత్వమని బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి భోగ శ్రావణి అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ దాడి చేయడాన్ని ఖండించారు. కమలదళం దండెత్తి వస్తే కాంగ్రెస్ వాళ్లకు దాక్కోవడానికి స్థలం కూడా దొరకదని హెచ్చరించారు. ప్రజాప్రభుత్వం పేరుతో రేవంత్‌రెడ్డి అరాచకం సృష్టిస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు, పార్టీ కార్యాలయాలపై దాడులకు పాల్పడటం హేయమైన చర్య అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజల దృష్టిని మరల్చేందుకే దాడులను ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాషాయ దళం తలచుకుంటే కాంగ్రెస్ పార్టీ ఎక్కడుంటుందో ఆలోచించుకోవాలన్నారు. తాను బీఆర్ఎస్‌ను వీడలేదు.. కాంగ్రెస్‌లో చేరలేదు.. అంటున్న ఎమ్మెల్యే సంజయ్ డిచ్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సమావేశానికి ఎందుకు వెళ్లారో చెప్పాలని ప్రశ్నించారు. జీవన్‌రెడ్డి నలభై ఏళ్లుగా కాపాడుతూ వచ్చిన కాంగ్రెస్ చీమల పుట్టలో సంజయ్ పాములా దూరాడని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి ఆముద రాజు, మహిళా మోర్చా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, సిరికొండ రాజన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు గంగరాజం, సింగం పద్మ, మామిడాల కవిత, సాగర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి నంది పురస్కారం



ధర్మపురి: పట్టణానికి చెందిన భోగ శివప్రసాద్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడికి గాన కోకిల కళానికేతన్ వారు నంది అవార్డు పురస్కారాన్ని అందజేశారు. జగిత్యాలలో జరిగిన వార్షికోత్సవంలో వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన వారికి నంది పురస్కారాలు అందించారు. వారిలో ధర్మపురికి చెందిన శివప్రసాద్‌కు వ్యాఖ్యానంలో నంది పురస్కారం అందించారు.. గతంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా, జాతీయ కళారత్న అవార్డులు పొందగా, నేడు నంది అవార్డుకు ఎంపిక కావడంపై పలువురు శివప్రసాద్‌ను అభినందించారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

మెట్‌పల్లిరూరల్: ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్ అన్నారు. మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. జగ్గాసాగర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు, మందుల స్టాక్, వ్యాధి నిరోధక టీకాలు, ల్యాబ్ పరిశీలించారు. టి హబ్‌కు పంపిస్తున్న శాంపిల్స్, క్షయ వ్యాధి కేసుల వివరాలపై ఆరా తీశారు. వెల్లుల, ఆత్మకూర్ సబ్‌సెంటర్లలో వ్యాధి నిరోధక టీకాలు వేయించారు. జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, మెట్‌పల్లి మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూరమ్మ ప్రాజెక్టు కాలువకు భూములివ్వం



కోరుట్ల ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

కథలాపూర్: మండలంలోని కలిగోట శివారులోగల సూరమ్మ ప్రాజెక్టు కుడికాలువకు తమ భూములు ఇవ్వబోమని కోరుట్ల ఆర్డీవో జివాకర్‌రెడ్డికి రైతులు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. కలిగోటలో గ్రామపంచాయతీ ఆవరణలో ఆర్డీవో రైతులతో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో 48 ఎకరాలు కుడి కాలువకు అవసరమని అధికారులు తెలిపారు. దీనిపై రైతులు మాట్లాడుతూ తమకు భూమి తక్కువగా ఉందని, భూమికి బదులు భూమి ఇవ్వాలని, లేకుంటే ఎకరాకు రూ.40 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని విన్నవించారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్, డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఐ నగేశ్, రైతులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నేరం



ఫర్టిలిటీ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న వైద్య బృందం

జగిత్యాల: స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేస్తే నేరమని మాతాశిశు సంక్షేమ కేంద్రం ప్రోగ్రాం అధికారి జైపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ఓ ఫర్టిలిటీ సెంటర్‌ను తనిఖీ చేశారు. రికార్డులు, స్కానింగ్ యంత్రాలను పరిశీలించారు. ప్రతినెలా ఐదో తేదీలోపు మోతెవాడలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఫాం ఎఫ్ సబ్మిట్ చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు భూమేశ్వర్, తరాల శంకర్, రాజేశం పాల్గొన్నారు.

పట్టుదలతో చదవాలి



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో

జగిత్యాలరూరల్: పట్టుదలతో చదివి లక్ష్యాన్ని సాధించాలని డీఈవో రాము అన్నారు. జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జీవితంలో విద్యార్థి దశ కీలకమైందన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన శివరాత్రి శరణ్య, అల్లె పూజలను అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సింగు సత్తయ్య, ఉపాధ్యాయులు భూపతిరావు, బాలె సరోజ, అనిత, రాజేందర్, ఫక్రుద్దీన్, శరత్, పీడీ కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

సారంగాపూర్: ఇంటర్‌లో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఇంటర్ విద్యాధికారి బి.నారాయణ అన్నారు. బుధవారం సారంగాపూర్, బీర్‌పూర్ మండల కేంద్రాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులతో సమావేశమయ్యారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి మంచి మార్కులు తెచ్చుకునేలా చూడాలన్నారు. ప్రిన్సిపల్స్ వై.రమేశ్‌బాబు, రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

క్లుప్తంగా

కాలువలో మహిళ మృతదేహం

- మృతురాలిది హనుమకొండ జిల్లా


సరోజన మృతదేహం

హుజూరాబాద్: మండలంలోని పెద్దపాపయ్యపల్లి శివారు ఎస్సారెస్పీ కాలువలో ఓ మహిళ మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. పెద్దపాపయ్యపల్లి గ్రామస్తులు బుధవారం ఎస్సారెస్పీ కాలువలో మహిళ మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీయించి, మార్చురీకి పంపంచారు. మృతురాలి వయసు సుమారు 50 ఏళ్లు ఉంటుందని, నీలం రంగు చీర ధరించినట్లు తెలిపారు. ఆమె వివరాల కోసం ఆరా తీశారు. అలాగే, హుజూరాబాద్ హెల్ప్ లైన్ టీం సభ్యులు హర్షద్ తదితరులు వాట్సాప్ గ్రూప్‌లలో ఈ విషయాన్ని వైరల్ చేశారు. చివరికి మృతురాలు హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన దూలం సరోజనగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తిరుమల్‌గౌడ్ పేర్కొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య


మనోహర్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన సిరిగాధ మనోహర్ (26) అనే యువ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మంగళవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. మనోహర్ హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. తాను అద్దెకుంటున్న గదిలో అర్ధరాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి పరామర్శించారు.

నాడు తల్లి.. నేడు తండ్రి మృతి


వర్షిణి, సాయిచరణ్

మానకొండూర్: గతేడాది తల్లి.. నేడు తండ్రి మృతిచెందడంతో వారి ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలంలోని ముంజంపల్లికి చెందిన బండారి వెంకటేశ్–రేణుక దంపతులకు వర్షిణి, సాయిచరణ్ సంతానం. వెంకటేశ్ ఆటో నడుపుతూ, రేణుక కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను పోషించుకునేవారు. గతేడాది తల్లి అనారోగ్యంతో మృతిచెందగా, పిల్లల బాగోగులు తండ్రి చూసుకుంటున్నాడు. అనారోగ్యానికి గురైన వెంకటేశ్ బుధవారం మృతిచెందాడు. అమ్మానాన్న మృతితో ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారని బంధువులు, గ్రామస్తులు కంటతడి పెట్టారు.

ఆర్టీసీ బస్సులు ఢీకొని ఒకరికి గాయాలు

మల్యాల(చొప్పదండి): ముందు వెళ్తున్న ఓ ఆర్టీసీ బస్సును వెనక నుంచి వస్తున్న మరో ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటన మల్యాల మండలంలో చోటుచేసుకుంది. జగిత్యాల నుంచి ఆర్డినరీ బస్సు కరీంనగర్ వైపు వెళ్తోంది. నూకపల్లి శివారులోకి రాగానే రోడ్డుపై గేదె అడ్డు రావడంతో డ్రైవర్ హఠాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో వెనకే వస్తున్న ఎక్స్‌ప్రెస్ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో మేడిపల్లి మండలం కొండాపూర్‌కు చెందిన హనుమక్క అనే మహిళ స్వల్పంగా గాయపడింది. ఆమెను జగిత్యాల ఆస్పత్రికి తరలించారు.


మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, వేదికపై కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

మహాజాతర ఘనంగా నిర్వహిద్దాం

- ఫిబ్రవరి 25 నుంచి 27 వరకు మహాశివరాత్రి వేడుకలు
- భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలి
- పారిశుధ్య నిర్వహణపై ప్రధాన దృష్టి
- భద్రతపై పోలీసులు అప్రమత్తంగా ఉండాలి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- కలెక్టర్ అధ్యక్షతన జాతర సమన్వయ కమిటీ సమావేశం

వేములవాడ: మహాశివరాత్రి జాతర ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. జాతర సందర్భంగా చేపట్టాల్సిన పనులపై వివిధ శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఫిబ్రవరి 25, 26, 27 తేదీల్లో జరిగే మహాశివరాత్రి మహోత్సవాల ఏర్పాట్లపై గుడి ఓపెన్‌స్లాబ్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధ్యక్షతన బుధవారం జాతర సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దేశించుకున్న పనులను జాతర సమయానికి వారం రోజుల ముందుగానే పూర్తిచేయాలని ఆదేశించారు.

4 లక్షలకు పైగా భక్తులు వచ్చే అవకాశం

దక్షిణకాశీగా పేరొందిన వేములవాడలో జరిగే మహాశివరాత్రి వేడుకలకు 4 లక్షలకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఈమేరకు ఏర్పాట్లు చేయాలని ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుంచి పారిశుధ్య కార్మికులను తెప్పించుకోవాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో భక్తులకు మజ్జిగప్యాకెట్లు, పాలు అందించేలా చూడాలన్నారు. దర్శనానికి క్యూలైన్‌లలో ఎక్కువ సమయం వేచి చూసే పరిస్థితులు ఉంటాయని, ప్రధాన ఆలయం చేరుకోకముందే అవసరం మేరకు టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వీఐపీలను దర్శనానికి ప్రత్యేకలైన్‌లో తీసుకెళ్లాలన్నారు. ధర్మగుండం వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని, నీటిని ఎప్పటికప్పుడు మార్చాలని తెలిపారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి: – కలెక్టర్

కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ ఆలయానికి సమీపంలోని ఖాళీ స్థలాలు, రైతుల సహకారంతో పొలాల్లో వాహన పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేములవాడకు వచ్చే అన్ని ప్రధాన రోడ్లలోని గుంతలను పూడ్చివేయాలన్నారు. జాతర విధుల కోసం వచ్చే సిబ్బందికి, వీఐపీలు, అతిథులకు వసతి సౌకర్యం కల్పించాలన్నారు. తాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్స్ ఏర్పాటు చేయాలన్నారు. అదనపు కల్యాణకట్టలు ఏర్పాటు చేయాలని తెలిపారు. బద్దిపోచమ్మ, నాంపెల్లి ఆలయాల వద్ద అదనపు క్యూలైన్లు సిద్ధం చేయాలన్నారు. ప్రధాన ఆలయం, తిప్పాపూర్, కోరుట్ల బస్టాండ్, జగిత్యాల రోడ్డు, పార్కింగ్ దగ్గర అవసరమైన హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. వేములవాడ పరిసరాల్లో మద్యం విక్రయాలు నిషేధించాలన్నారు. జాగారం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.

పోలీసులకు సహకరించాలి: – ఎస్పీ అఖిల్ మహాజన్

ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ అదనపు ప్రసాదం కౌంటర్‌లు, గతం కంటే అధికంగా పార్కింగ్ ప్లేస్‌లు ఏర్పాటు చేయాలని, అక్కడ పోలీసుల కోసం టెంట్, తాగునీటి సరఫరా ఉండాలన్నారు. బద్దిపోచమ్మ ఆలయం వద్ద రోడ్డు ఆక్రమణలు కాకుండా స్పెషల్ డ్రైవ్ పెట్టాలని సూచించారు. బైపాస్‌రోడ్డులోని కూరగాయల మార్కెట్‌ను మూడు రోజుల పాటు బంద్ పెట్టేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి, ఆర్డీవో రాజేశ్వర్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేశ్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ సత్యనారాయణగౌడ్, ఏఎంసీ చైర్మన్ రొండి రాజు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు తదితరులు పాల్గొన్నారు.


హాజరైన జిల్లా అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు

ప్రసాదాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

లడ్డూ, పులిహోర ప్రసాదాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆలయ అధికారులను ఆదేశించారు. లడ్డూ ప్రసాదం తయారీ కేంద్రాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్డీవో రాజేశ్వర్‌లతో కలిసి తనిఖీ చేశారు. స్టోర్‌రూమ్, లడ్డూ తయారీకి వినియోగించే పదార్థాలు, నెయ్యి, తయారీ విధానం, పరిసరాలను పరిశీలించారు. లడ్డూ ప్రసాదం తయారీ కేంద్రాన్ని పూర్తిగా ఆధునీకరించాలని సూచించారు.

జాతర పూజలు ఇలా..

ఆలయ ప్రధాన అర్చకులు శరత్‌శర్మ మహాశివరాత్రి జాతర సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలు వివరించారు.

- ఫిబ్రవరి 25 : రాత్రి 7 గంటలకు ప్రభుత్వం తరఫున, 7.30 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం పక్షాన పట్టువస్త్రాల సమర్పణ.
- ఫిబ్రవరి 26 : రాత్రి 12 గంటల నుంచి 2.30 గంటల వరకు పట్టణ ప్రజలకు సర్వదర్శనం, 2.30 నుంచి 3.30 గంటల వరకు ప్రజాప్రతినిధులు, స్థానిక అధికారులకు దర్శనం
- తెల్లవారు జాము 3.30 నుంచి 3.40 గంటల వరకు మంగళవాయిద్య ప్రదర్శన, 3.40 నుంచి 4.30 గంటల వరకు సుప్రభాత సేవ, ఆలయ శుద్ధి.
- ఉదయం 4.30 నుంచి 6 గంటల వరకు ప్రాతఃకాలపూజ, అనువంశిక అర్చకుల దర్శనం.
- సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు శివదీక్ష స్వాముల దర్శనం, సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు మహాలింగార్చన(స్వామివారి కల్యాణ మండపంలో) అనువంశిక బ్రాహ్మణోత్తముల దర్శనం. రాత్రి 11.35 నిమిషాలకు లింగోద్భవ కాలంలో స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం.
- ఫిబ్రవరి 27 : రోజంతా భక్తులకు దర్శనాలు, రాత్రి ఉత్సవాల ముగింపు.

దొరికిన చిన్నారి అద్విత ఆచూకీ

- వేములవాడలో అదృశ్యం.. మహబూబాబాద్‌లో లభ్యం
- రంగంలోకి ఏడు పోలీస్ బృందాలు


అద్విత

సిరిసిల్లక్రైం: రాజన్న గుడికి తల్లితోపాటు వచ్చిన నాలుగేళ్ల చిన్నారి పది రోజుల క్రితం తప్పిపోగా.. పోలీసులు ముమ్మర గాలింపులతో మహబూబాబాద్‌లో ఆచూకీ లభించింది. వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం చింతలపల్లికి చెందిన సింగారపు లాస్య మతిస్థిమితం సరిగ్గా ఉండదు. ఈక్రమంలోనే తన నాలుగేళ్ల కూతురు అద్వితతో కలిసి డిసెంబర్ 10న ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలిస్తున్నారు. అయితే డిసెంబర్ 28న వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చినట్లు లాస్య సోదరుడు పలమారి గంగాస్వామికి తెలవడంతో వెంటనే ఇక్కడికి వచ్చాడు. అయితే చిన్నారి అద్విత కనిపించలేదు. వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వేములవాడలోని సీసీ పుటేజీలను పరిశీలించిన పోలీసులు అద్వితను ఇద్దరు గుర్తుతెలియని మహిళలు అపహరించుకుపోయినట్లు నిర్ధారణకు వచ్చారు. చిన్నారి ఆచూకీ కోసం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఏడు పోలీస్ బృందాలను రంగంలోకి దింపి గాలింపు చేపట్టారు. ఈక్రమంలోనే బుధవారం మహబూబాబాద్‌లో అద్విత ఆచూకీ లభించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని జిల్లా పోలీసు ఉన్నతాధికారి వివరణ కోరగా.. పాప ఆచూకీ లభించిందని, త్వరలోనే కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని తెలిపారు.

14న మకర సంక్రాంతి

కరీంనగర్‌కల్చరల్: ఈనెల 13న భోగి, 14న మకర సంక్రాంతి, 15న కనుమ పండుగ జరుపుకోవాలని నగర వైదిక ప్రధాన పురోహితుడు మంగళంపల్లి శ్రీనివాస శర్మ ఒక ప్రకటనలో తెలిపారు.14న 2:35 గంటలనుంచి సాయంత్రం 6:15 గంటల వరకు సంక్రాంతి పెండ్లి నోములు, గౌరీ వ్రతాలు, గౌరమ్మకు పూజలు జరుపుకోవచ్చన్నారు. 15న కనుమ సందర్భంగా ముత్తైదువులు పసుపు కుంకుమలతో నోములు, వాయినాలు ఇచ్చిపుచుకోవచ్చన్నారు.

3 గంటలు ఆర్తనాదాలు.. మృత్యుఒడికి

- అదుపుతప్పి చెట్టును ఢీకొన్న లారీ
- డ్రైవర్ మృతి.. క్లీనర్‌కు తీవ్ర గాయాలు

హుజూరాబాద్: లారీ చెట్టును ఢీకొట్టింది.. డ్రైవర్, క్లీనర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు.. తమను కాపాడాలంటూ ఆర్తనాదాలు చేశారు.. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని, 3 గంటలపాటు శ్రమించి, వారిని బయటకు తీశారు.. కానీ, అప్పటికే డ్రైవర్ మృతిచెందాడు. సీఐ తిరుమల్‌గౌడ్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా నుంచి ఓ లారీ గుజరాత్‌కు లోడుతో వెళ్తోంది. బుధవారం తెల్లవారుజామున హుజూరాబాద్ మండలంలోని మందాడిపల్లి శివారులో అదుపుతప్పి, చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ ముందుభాగం పూర్తిగా దెబ్బతినడంతో.. డ్రైవర్ శివారెడ్డి, క్లీనర్ షేక్ బబ్లూ(విజయవాడవాసులు) క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. తమను కాపాడాలంటూ వారు చేసిన ఆర్తనాదాలతో గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ తిరుమల్‌గౌడ్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి వచ్చారు. 3 గంటలపాటు శ్రమించి, బాధితులను బయటకు తీశారు. అప్పటికే శివారెడ్డి చనిపోయాడు. క్లీనర్ షేక్ బబ్లూ పరిస్థితి విషమంగా ఉండటంతో హుజురాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.


శివారెడ్డి మృతదేహం

వ్యవసాయ కూలీలకు గాయాలు

ట్రాలీఆటో బోల్తాపడిన ఘటనలో వ్యవసాయ మహిళా కూలీలకు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలంలోని కందుగులకు చెందిన 12 మంది వ్యవసాయ కూలీలు బుధవారం ట్రాలీఆటోలో పనికి వెళ్తున్నారు. ధర్మరాజుపల్లి స్టేజీ వద్దకు రాగానే ఎదురుగా వచ్చే బైక్‌ను తప్పించబోయి వీరి వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కూలీలందరూ గాయపడ్డారు. స్థానికులు 108కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి, బాధితులను హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో ఈసంపల్లి ప్రమీల, రొంటాల స్వరూప తీవ్రంగా గాయపడటంతో వారిని మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు.

శివాలయంలో కవిత పూజలు


కొత్తపల్లి శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణంలోని శ్రీ శివాలయం (సీతారామాంజనేయ సహిత శ్రీ సాయిబాబా దేవాలయం)లో బుధవారం రాత్రి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపల్లిలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన ఆమెకు తొలుత ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అభిషేకం చేయించారు. వేద పండితులు ఈ సందర్భంగా కవితకు ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందించి సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌గౌడ్, స్థానిక కౌన్సిలర్ గున్నాల విజయతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా

- డ్రైవర్ దుర్మరణం

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మంగపేట గ్రామంలో బుధవారం ఆటో బోల్తాపడి డ్రైవర్ చొప్పరి శ్రీనివాస్(62)మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. జమ్మికుంట నుంచి గోదావరిఖనికి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో.. మంగపేటకు చేరుకోగానే కుక్క అడ్డు వచ్చింది. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న జమ్మికుంట మండలం మోత్కులగూడెం గ్రామానికి చెందిన ముక్కిరి భాగ్య– రాయమల్లు దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. జమ్మికుంటకు చెందిన ఆటో డ్రైవర్ శ్రీనివాస్ తలకు బలమైన గాయాలు కావడంతో కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకటేశ్ కేసు నమోదు చేసుకున్నారు.


చొప్పరి శ్రీనివాస్ మృతదేహం

గంజాయి కేసులో నిందితుడి రిమాండ్

పెగడపల్లి: మూడురోజుల క్రితం పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన గంజాయి విక్రయ కేసులో నిందితుడు అనక సురేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మల్యాల సీఐ రవి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రవికిరణ్‌తో కలిసి సీఐ బుధవారం నిందితుడిని అరెస్టు చూపించారు. పెగడపల్లి మండలం నర్సింహునిపేట శివారులో ఆదివారం గంజాయితో నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారిని విచారించగా ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లికి చెందిన అనక సురేశ్ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారు. వారి సమాచారం మేరకు సురేశ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. సిబ్బంది శ్రావణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



నిందితుడిని అరెస్టు చూపుతున్న సీఐ రవి, ఎస్సై రవి కిరణ్

రోబోటిక్ సర్జరీతో 4 గంటల్లో నడవొచ్చు

- యశోద ఆస్పత్రి ఆర్థోపెడిక్ వైద్యుడు సునీల్ దాచేపల్లి

కరీంనగర్‌టౌన్: రోబోటిక్ సర్జరీతో మోకీలు మార్పిడి చేస్తే 4 గంటల్లోనే నడవొచ్చని యశోద ఆస్పత్రి సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యుడు, రోబోటిక్ జాయింట్ రిప్లేస్‌మెంట్ నిపుణుడు డా.సునీల్ దాచేపల్లి అన్నారు. బుధవారం కరీంనగర్ యశోద మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోకాళ్ల నొప్పిని చిన్న విషయంగా తీసుకోవద్దని, తొలిదశలోనే చికిత్స తీసుకోవాలని చెప్పారు. అమెరికాతో సమానంగా హైదరాబాద్‌లో రోబోటిక్ సర్జరీ చేయడం గర్వంగా ఉందన్నారు. ఇందులో పేషెంట్లకు తక్కువ నొప్పి ఉంటుందని, వేగవంతంగా కోలుకుంటారని తెలిపారు. కరీంనగర్‌కు చెందిన అడ్వకేట్ జగదీశ్ చందర్‌రావు, హెడ్‌కానిస్టేబుల్ రాజయ్య మాట్లాడుతూ.. తాము కొన్నేళ్లుగా మోకాళ్ల నొప్పులతో బాధ పడుతున్నామని అన్నారు. మిత్రుల సూచనల మేరకు యశోద హాస్పిటల్లో రోబోటిక్ సర్జరీ చేయించుకొని, ప్రస్తుతం మాములు స్థితిలో నడవగలుగుతున్నామని తెలిపారు. ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ సునీల్

సస్పెండైన పంచాయతీ కార్యదర్శిపై విచారణ


పూడూర్ గ్రామపంచాయతీలో విచారణ జరుపుతున్న అధికారులు

కొండగట్టు(చొప్పదండి): అక్రమ లేఅవుట్లకు మద్దతు తెలుపుతూ.. ఇళ్ల అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చి సస్పెండ్ అయిన పంచాయతీ కార్యదర్శిపై ఉన్నతాధికారులు బుధవారం విచారణ చేపట్టారు. కొడిమ్యాల మండలం అప్పారావుపేట పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు గతంలో అక్రమ లేఅవుట్లకు, ఇంటి నిర్మాణాలకు అనుమతి ఇచ్చారని విచారణ జరిపిన అప్పటి కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఇందులో భాగంగా శాఖాపరమైన చర్యలు చేపట్టడానికి కార్యదర్శిపై వచ్చిన ఆరోపణలపై జిల్లా సహకార అధికారి మనోజ్, ఎంపీఓ మహమ్మద్ సలీం విచారణ జరిపారు. నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు. అప్పారావుపేట జీపీలో అక్రమాలు జరిగితే పూడూరులో విచారణ జరపడం పలు అనుమానాలకు తావిస్తోందని గ్రామస్తులు అంటున్నారు.

రైతుకు మొగిపురుగు బెంగ

- వరి నాటు నుంచే పురుగు ఉధృతి
- రసాయన మందులు పిచికారీ చేసినా అదుపులోకి రావట్లే..
- పంట మార్పిడి చేయకపోవడం వల్లే అంటున్న శాస్త్రవేత్తలు
- కరీంనగర్ జిల్లాలో 2.60 లక్షల ఎకరాల్లో వరి సాగు అంచనా



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు అనిల్. వీణవంక మండలం మల్లన్నపల్లి గ్రామం. తనకున్న రెండెకరాల్లో సన్నరకం వరి సాగు చేశాడు. నారుమడి దశలోనే రెండుసార్లు రసాయన మందు పిచికారీ చేయడంతోపాటు 3జీ గుళికలు చల్లాడు. నాటు వేసిన ఐదు రోజుల నుంచే మొగిపురుగు విజృంభించింది. దీంతో వారం తర్వాత వరిలో గుళికలు చల్లాడు. అయినా పురుగు ఉధృతి తగ్గకపోవడంతో మళ్లీ రసాయన మందులు పిచికారీ చేశాడు. నాటు వేసి, 18 రోజులైంది. ఈ సమయంలోనే పురుగు బెడద ఇలా ఉంటే పంట చేతికొచ్చేనా అని రైతు కలవరపడుతున్నాడు. 30 ఏళ్లలో ఎప్పుడూ ఈ పరిస్థితి చూడలేదని వాపోతున్నాడు. ఇప్పటికే ఎకరాకు రూ.6 వేలు రసాయన మందులు, గుళికలకే వెచ్చించానని చెబుతున్నాడు. ఇదీ ఈ ఒక్క రైతు పరిస్థితే కాదు.. కరీంనగర్ జిల్లాలో వరి రైతులందరిది.


వరి పైరుకు రసాయనం చేస్తున్న రైతు

వీణవంక(హుజూరాబాద్): యాసంగి నాట్లు ఇంకా పూర్తవనేలేదు. రైతులకు మొగిపురుగు బెంగ పట్టుకుంది. నాటు వేసిన నుంచే పురుగు దాడి చేస్తోంది. పంటను కాపాడుకోవడానికి రైతులు నానాతంటాలు పడుతున్నారు. డిసెంబర్ 20 నుంచి జనవరి 5లోపు వేసిన నాట్లకు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంది. రసాయన మందులు పిచికారీ చేసినా అదుపులోకి రావడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. మూడేళ్లుగా యాసంగిలో ఇదే దుస్థితి తలెత్తుతోందని ఆవేదన చెందుతున్నారు. గతంలో ఎక్కువగా దొడ్డు రకం వరికే పురుగు బెడద ఉండేది. కానీ, ప్రస్తుతం హైబ్రిడ్(ఆడ, మగ) వరికి సైతం వ్యాప్తి చెందుతుండటంతో కంపనీల ప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు. ఈసారీ వాతావరణ పరిస్థితులు భిన్నంగా ఉండటంతో పంట చేతికి రావడం గగనమేనని రైతులు అంటున్నారు.

1.40 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తి..

ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయడంతో చివరి ఆయకట్టు రైతులు సైతం నాట్లు వేయడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే చెక్‌డ్యాంలు, చెరువుల్లో ఆశించిన స్థాయిలో నీరు నిల్వ ఉండటంతో జిల్లాలో ఈ యాసంగిలో 2.60 లక్షల ఎకరాల్లో వరి సాగులోకి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు 1.40 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. మొగిపురుగు నుంచి నారుమడిని కాపాడుకోవడానికి రైతులు కనీసం ఐదుసార్లు రసాయన మందులు పిచికారీ చేశారు. నాటు వేసిన తర్వాత కూడా ఉధృతి తగ్గలేదు. పత్తి, మొక్కజొన్న పంటలకు పిచికారీ చేసే రసాయనాలు వాడినా ఫలితం ఉండటం లేదని చెబుతున్నారు.

మూడేళ్లుగా దాడి..

గత మూడేళ్లుగా వరి పంటపై మొగిపురుగు దాడి చేస్తోంది. గత యాసంగిలో పెట్టిన పెట్టుబడి కూడా రైతులకు రాలేదు. ఈసారి పురుగు ప్రభావం అంతకంటే ఎక్కువగా ఉంది. సూర్యరశ్మి రోజుకు 7 గంటల కంటే తక్కువగా ఉండటం, యూరియా, కాంప్లెక్స్ ఎరువులు ఎక్కువగా వాడిన పొలాల్లో ఈ పురుగు ప్రభావం తీవ్రంగా ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. 3జీ లేదా 4జీ గుళికలు ఎకరాకు 4 కిలోలు వేయాలి. కానీ, 8–10 కిలోలు వేసినా పురుగు వ్యాప్తిని నివారించలేకపోతున్నారు. కూలీ రేట్లు ఎకరాకు రూ.3,900(సాధారణం) నుంచి రూ.6 వేలకు పెరిగాయి. హైబ్రిడ్(ఆడ, మగ) వరి ఎకరాకు రూ.8 వేలు ఖర్చవుతోంది. కూలీలను పొలం వద్ద చేర్చేందుకు ఆటో కిరాయి రూ.1,500 అదనంగా రైతులపై భారం పడుతోంది.

పంట మార్పిడి లేకనే.

రైతులు ఏళ్లుగా ఒకే రకమైన పంట సాగు చేస్తున్నారు. దీనికితోడు విచ్చలవిడిగా రసాయనాలు వినియోగిస్తున్నారు. ఇవన్నీ పంటపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మూడేళ్లకోసారైనా పంట మార్పిడి చేస్తే ఈ దుస్థితి తలెత్తదని అంటున్నారు. మొగి పురుగు ఉధృతిని అడ్డుకునే చర్యలపై ఏఈవోలు రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

సేంద్రియ ఎరువులు వాడాలి

మూడేళ్లకోసారి పంట మార్పిడి చేయాలి. లేకుంటే భూసారం దెబ్బతిని, పంట పండని దుస్థితి తలెత్తుతుంది. సాధ్యమైనంత వరకు రసాయన మందుల వాడకం తగ్గించాలి. సేంద్రియ ఎరువులు వినియోగించాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఎకరాకు 3జీ లేదా 4జీ గుళికలు 8 కిలోల చొప్పున ఇసుకలో కలిపి చల్లాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త, కేవీకే, జమ్మికుంట